మన్యంలో వర్ష బీభత్సం

- విరిగిపడిన చెట్ల కొమ్మలు... - విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యంలో ప్రతిరోజు వర్షం బీభత్సం సృష్టిస్తుంది. ప్రతిరోజు ఏదో ఒకచోట కుంభవృష్టి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మొన్న లోతుగెడ్డలో కుంభవృష్టి వర్షం కొరవడంతో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఏర్పడిన విషయం పాఠకులకు తెలిసిందే. శనివారం చింతపల్లిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పొడి వాతావరణం ఉన్నప్పటికీ ఒక్కసారిగా వాతావరణంలో పెను మార్పులు సంభవించి మధ్యాహ్నం రెండు గంటల తరువాత హఠాత్తుగా వర్షం కురిసింది. ఈ వర్షాలు వ్యవసాయానికి అనుకూలమే అయినప్పటికీ ప్రతిరోజు కురుస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విలేకరులు సమాజానికి నిష్పక్షపాత సేవకులు

గూడెం కొత్తవీధి సిఐ అప్పలనాయుడు, ఎస్సై అప్పలసూరి

విశాలాంధ్ర-జీకే వీధి : సమాజంలో పత్రికలు పత్రిక విలేకరులు నిష్పక్షపాత సేవకులని గూడెం కొత్తవీధి సీఐ అప్పల నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ ఏపీయుడబ్ల్యూజే 67వ వార్షికోత్సవం సందర్భంగా గూడెం కొత్త వీధి పత్రిక విలేకరులు సీఐ అప్పలనాయుడు ఎస్ఐ అప్పల సూరి సమక్షంలో గూడెం కొత్త వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు పాలు పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ అప్పలనాయుడు మాట్లాడుతూ. పత్రిక విలేకరులు ఇలా సమాజ సేవలో పాల్గొనడం అధికారులుగా తమను కదిలిస్తుందని పోలీసు అధికారిగా మారుమూల ప్రాంతాలలో తాము చేస్తున్న సేవలు గిరిజన ప్రజలకు ఆనందాన్ని కలిగిస్తూ ఉంటాయని అలాగే మండల కేంద్రంలో పాత్రికేయులు అందరూ ఇటువంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తమ వంతు బాధ్యతగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇటువంటి మహోత్తరమైన కార్యక్రమంలో తమ ద్వారా రోగులకు పాలు రొట్టెలు పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఎస్సై అప్పలసూరి మాట్లాడుతూ మండలంలో పత్రికా విలేకరులు అందరూ కలిసి ఇటువంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాల్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పత్రికల్లో పనిచేస్తున్న విలేకరులు పాల్గొన్నారు.

అరుకు అందాలు అద్భుతం : జస్టిస్ జెకె మహేశ్వరి

గిరిజన సాంప్రదాయంలో సుప్రీంకోర్టు జడ్జి వివాహం

విశాలాంధ్ర-అరకులోయ : అరుకు అందాలు అద్భుతంగా ఉన్నాయని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జెకె మహేశ్వరి కొనియాడారు. శనివారం జస్టిస్ దంపతులు అరకులోయలో పర్యటించారు. రైలులో అరకు చేరుకున్న జస్టిస్ దంపతులను సంయుక్త కలెక్టర్ డా. ఎంజె అభిషేక్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఘన స్వాగతం పలికారు. ముందుగా రైల్వే అతిథి గృహానికి చేరుకున్న జస్టిస్ దంపతులు ట్రైబల్ మ్యూజియం సందర్శించారు. అక్కడ గిరిజన సంస్కృతి సంప్రదాయాలను తిలకించి మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం పెదలబుడు పంచాయతీలోని గిరి గ్రామదర్శిని సందర్శించారు. గిరి గ్రామదర్శినిలో గిరిజన సంప్రదాయం ప్రకారం గిరిజన వస్త్రధారణ గావించిన జస్టిస్ దంపతులు గిరిజన సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. జస్టిస్ దంపతుల వివాహ వేడుకను అట్టహాసంగా నిర్వహించిన నిర్వాహకులను జస్టిస్ దంపతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, పోక్సో కోర్టు జడ్జి జి. ఆనంది, అడిషనల్ జిల్లా జడ్జి పి.గోవర్ధన్, గాజువాక సీనియర్ సివిల్ జడ్జి ఈ.రాజేంద్రబాబు, రెండవ అదనపు సివిల్ జడ్జి డి .సోని, రైల్వే కోర్టు మెజిస్ట్రేట్ కే.అనురాగ్, మూడవ అదనపు సివిల్ జడ్జి జి. కార్తీక్, అనకాపల్లి ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జ్ ఏ. రమేష్, చోడవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.స్వర్ణ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్, డిఆర్‌ఓ బి. పద్మావతి, అరకులోయ తాసిల్దార్ వేణుగోపాల్, జిల్లా టూరిజం అధికారి దాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవల బంద్

- ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను ఉరి తీయాలి
- డాక్టర్ హత్యకు నిరసనగా డాక్టర్స్, స్టాఫ్ నర్స్ నిరసన ర్యాలీ
- ఏఐఎస్ఎఫ్ బృందం మద్దతు తెలియజేస్తూ వైద్యులతో ర్యాలీ నిర్వహణ

విశాలాంధ్ర-పాడేరు : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నా విషాదకరమైన ఘటన కలకత్తా (ఎఫ్ఎంఆర్‌ఆర్‌జిఆర్) మెడికల్ కాలేజీ, హాస్పిటల్ లో ట్రైని డాక్టర్ పై హత్యచారం జరిగి హత్యకు పాల్పడ్డా నిందితులను తక్షణమే పట్టుకుని ఉరితీయలని శనివారం పాడేరు ఐటిడిఏ నుంచి అంబేద్కర్ కూడలి వరకు వైద్యులు, స్టాఫ్ నర్స్ లు శాంతియుత నిరసన ర్యాలీ చేశారు.వైద్యులు చేస్తున్నా నిరసనకు అఖిల భారత విద్యార్థి (ఏఐఎస్ఎఫ్) బృందం వారితో కలిసి నిరసన ర్యాలీ చేస్తూ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అల్లూరి జిల్లా కన్వీనర్ కె. రాజశేఖర్ మాట్లాడుతూ హాస్పిటల్లో అనారోగ్య కారణాలతో వెళ్లే వారికి ఎంతో న్యాయం చేసే వైద్యులకు న్యాయం జరగడం లేదన్నారు. హాస్పిటల్స్‌లో ఉమెన్స్ డాక్టర్స్‌కు రెస్ట్ రూమ్‌లు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళల రక్షణ కోసం కఠినమైన చట్టాలు ఉన్నప్పటికీ వాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిగ్గా అమలుచేయడం లేదన్నారు. స్త్రీని ప్రధాన దేవతగా పూజించే మన దేశంలోనే స్త్రీని బానిసలుగా చూసే దేశంగా మారుతుందని విమర్శలు చేశారు. ట్రైని డాక్టర్ 32గంటల పని చేసి రెస్ట్ తీసుకోవడానికి సరైన రెస్ట్ రూమ్ లేకపోవడం వాళ్ళ ఈ దారుణమైన ఘటన జరిగిందని గుర్తు చేశారు. ఉమెన్స్ డాక్టర్స్, స్టాఫ్ నర్స్ లకు ప్రతి ఆసుపత్రిలో రెస్ట్ రూమ్ లు ఉండేలా, పని సమయం తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ట్రైని డాక్టర్ ను హత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులకు తక్షణమే పట్టుకుని వెంటనే విచారణ లేకుండా ఎంకౌంటర్, లేదా ఉరి శిక్ష విధించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ, చిన్నా, డాక్టర్స్, నర్స్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాంగి పద్మ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

విశాలాంధ్ర-అరకులోయ : అరకులోయ మండలం పానిరంగని గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ పొదల వద్ద చంటి బిడ్డతో చెట్టుకు వేలాడుతూ మృతిచెందిన పంగి పద్మ అనుమానస్పద మృతిలో నిష్పక్షపాతంగా క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈనెల 16వ తేదీన పానిరంగిని గ్రామ సమీపంలో పాత రైల్వే ట్రాక్ దగ్గరలో ఓ చెట్టు పొదాలు వద్ద పాంగ్గి పద్మ రెండేళ్ల చంటి బిడ్డతో వేలాడుతూ కనిపించిన దృశ్యాన్ని పలువురు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న అరకులోయ పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. రెండు రోజుల క్రితం పద్మాపురం గ్రామం నుండి అక్క ఉంటున్న పానిరంగిని గ్రామానికి వచ్చిన పాంగి పద్మ మృతి వెనక అనేక అనుమానాలు ఉన్నాయని బంధువులు గగ్గోలు పెడుతున్నారు. పాంగి పద్మ అనుమానస్పృత మృతిపై అరకులో పోలీసులు అన్ని కోణాలలో దర్యాప్తు జరిపించి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు. పాంగి పద్మ చంటి బిడ్డతో ఉరి వేసుకునే పిరికిరాలు కాదని దీని వెనక బలమైన కారణాలున్నాయని వాటన్నింటినీ పోలీసులు తమ దర్యాప్తులో వెలికి తీయాలని బంధువులు కోరుతున్నారు. ఇది ఎలా ఉండగా అనుమానస్పద మృతి కేసుఖ నమోదు చేసిన పోలీసులు అన్ని అన్ని కోణాల్లో తమదైన శైలిలో దర్యాప్తు చేయడానికి ముందుకు సాగుతున్నారు. పానీ రంగిని వివాహిత అనుమానస్పద మృతి పై త్వరలోనే వాస్తవాలు వెల్లడి చేస్తామని అరకులోయ పోలీసులు స్పష్టం చేశారు.

కేజీబీవీ నిర్వహణపై జడ్జి అసంతృప్తి

- విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలి
- జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి చోడవరం, అరకు ఇన్చార్జి జి.స్వర్ణ శుక్రవారం రాత్రి 10 గంటలకు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూ పరిశీలించారు. ప్రతి ఒక్క తరగతి గదిని క్షణంగా పరి శీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం సూచించే మెనూకు అనుగుణంగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ప్రిన్సిపాల్ భవానీకి ఆదేశించారు. రికార్డులను తనిఖీ చేశారు. స్టాక్ రూమ్ లో సరకులను పరిశీలించగా అక్కడ భోజనం మెనూ నిత్యవసర సరుకులు లేకపోవడంతో పాటు గదుల్లో కిటికీలకు మెష్ లు లేకపోవడం, సైడ్ గోడలు లేకపోవడం, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ లీకేజీలను గుర్తించిన ఆమె ఎస్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మాసంతర సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అయితే వాటిని విద్యార్థులకు పంపిణీ చేయకపోవడంతో అడగగా ప్రభుత్వం నుంచి సప్లై లేకపోవడంతో అందించడం లేదని ఎస్ ఓ చెప్పడంతో జడ్జి ఆగ్రహం వ్యక్తం చేసి, ముందుగా విద్యార్థులకు కొని తెచ్చిపెట్టి ఆ తర్వాత బిల్లులు పెట్టుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులకు పెట్టాల్సిన భోజనంను సక్రమంగా అమలు చేయాలని లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తప్పదని ఆమె హెచ్చరించారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామ న్నారు. పాఠశాల ప్రాంగణంలో విద్యుత్ లేకపోవడంతో త్రీ ఫేజ్ విద్యుత్ ఏర్పాటుకు అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతో పాటు, అవసరాలకు అను గుణంగా సౌకర్యాలు సమకూర్చే బాధ్యత పాఠశాల సిబ్బందిదేనన్నారు. ఈ వారంలో మరోసారి పాఠ శాల తనిఖీకి చేస్తామన్నారు.

అరుకు సుందరీకరణ పనులకు శ్రీకారం : సర్పంచ్

విశాలాంధ్ర-అరకులోయ : అరకులోయ పట్టణ కేంద్రంలోనీ మెయిన్ రోడ్డు మధ్యలో మొక్కలతో సుందరీకరణ పనులు ప్రారంభించి నట్లు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు అన్నారు. రోడ్డు డివైడర్ పై మొక్కలు నాటే కార్యక్రమం శనివారం జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న అరకును అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. మొత్తం 500 మొక్కలతో అరకు మెయిన్ రోడ్డు మొత్తం పచ్చగా మార్చాలనే సంకల్పంతో ఈ పనులను ప్రారంభించం అన్నారు. సందర్భంగా సర్పంచ్ పెట్టెలి దాసుబాబు తొలుత 200 మొక్కలను నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పాలక రాజకుమార్, సచివాలయం సిబ్బంది భగత్ రామ్, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలందరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

విశాలాంధ్ర-జి.మదుగుల : ప్రజలందరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని గాంధీనగర్ పంచముఖ ఆంజనేయ సాయిరాం స్వామీజీ తెలిపారు. జి.మాడుగుల పంచాయతీలోని చెక్కరాయి గ్రామంలో సామాజిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామస్తులకు దుస్తులు, రగ్గులు, మంచాలు, పెట్టెలు, కుర్చీలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిరాం స్వామీజీ మాట్లాడుతూ చెడు అలవాట్ల కు దూరంగా ఉండాలని, సన్మార్గంలో వెళ్ళాలని తెలిపారు. పిల్లలను బాగా చదివించుకోవా లన్నారు. తాగుడుకు దూరంగా ఉండాలి. గ్రామ స్తులతో తాగమని ప్రతిజ్ఞ చేయించారు. గ్రామానికి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఉచితంగా అందజేస్తామని తెలిపారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, చెప్పులను వారంలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మత్స్యరాజు, రాజు, వెంకటరమణ, పాపిటిరాజు, భీమసంకర్ నాయుడు, సత్యనారాయణ, సింహాచలం, సన్యాసిరావు, పంతులురాజు, భక్తులు పాల్గొన్నారు.

ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్‌విఎస్ కుమార్

విశాలాంధ్ర-బెలగాం : మన్యం జిల్లా ఏఐటియూసి ప్రధాన కార్యదర్శిగా ఆర్వీఎస్ కుమార్, జిల్లా ప్రెసిడెంట్‌గా సింహాద్రి దుర్గారావును నియమించినట్లు ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ప్రకటించారు. మన్యం జిల్లా ఎఐటియూసి జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం ఆర్వీఎస్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పడాల రమణ మాట్లాడుతూ ఎఐటియూసి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు రమణ తెలిపారు. మన్యం జిల్లా ఎఐటియూసి గౌరవాధ్యక్షునిగా సిద్ధ రామచంద్రరావుతో పాటు కార్యవర్గంలో అలజంగి కుమారమ్మ, రాగోలు దుర్గాప్రసాద్, మజ్జి చంద్రమౌళి, సాలాపు అనంతరావులతో పాటు మిగిలిన సభ్యులను నియమించినట్లు తెలిపారు. ఈసమావేశంలో విజయనగరం జిల్లా ఉమ్మడి కార్యదర్శి బుగత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై హత్యాచార ఘటనకు బాధ్యులైనవారిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : కోల్‌కత్తాలోని ఆర్ జి ఆర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది ఎల్విన్ పేట జంక్షన్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వైద్యురాలిపై హత్యాచార ఘటనకు బాధ్యులైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులలోని వైద్యులకు, సిబ్బందికి భద్రతను కల్పించాలని తెలిపారు. డాక్టర్ పై జరిగిన దాడిని ఖండిస్తూ ఆమెకు సంఘీభావంగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాదరావు, డాక్టర్ ధరణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుంది...

కురుపాం : సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు చేస్తున్నవారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రాణాలు పోస్తున్న డాక్టర్లపై పాశవిక దాడి చేసి ప్రాణాలు తీయడం ఎంతవరకు సమంజసం అని దీనిపై న్యాయం ఆలస్యం అవ్వకూడదని దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని డాక్టర్ మౌనిక, డాక్టర్ సుక్రుత, డాక్టర్ స్వాతిలు డిమాండ్ చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో వైద్య సిబ్బందికు రక్షణ కల్పించాలని దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని కోరారు. బాధితురాలికి న్యాయం వెంటనే జరగకపోతే మా పోరాటం ఉధృతంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో హాస్టల్లో నెలకొన్న విద్యార్థులు పడుతున్న సమస్యలు పరిష్కారం చేయాలని ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు హాస్టల్స్ ను సందర్శించిన సమయంలో విద్యార్థులు సమస్యలతో స్వాగతం పలుకుతున్నారు అన్నారు. తక్షణమే డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరారు. మక్కువ ప్రభుత్వ కళాశాలలో ప్రహరీ గోడ మరియు ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేయాలి. అదేవిధంగా మామిడిపల్లిలో శంకుస్థాపనకే పరిమితమైన బాలికల పాఠశాలకు బిల్డింగ్ పూర్తి చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అనేక హాస్టల్స్ కి సొంత భవనాలు ఏర్పాటు చేయాలి.ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేయాలి. ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు

తాగునీటి సమస్యల పరిష్కారంపై దృష్టి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందించేందుకు అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఎమ్మెల్యే విజయ్ చంద్ర కోరారు. శనివారం తోటపల్లి వద్ద నాగావళి నదిలోని ఇన్ ఫిల్టరేషన్ బావులు బూస్టర్ పంప్ హౌస్ తదితర వాటిని పరిశీలించారు.రంగు నీరు ఎందుకు సరఫరా అవుతుందో పరిశీలించారు. పట్టణ ప్రజలకు ఎదురవుతున్న తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఆనందరావు, టిడిపి నాయకులు బార్నాల సీతారాం కోరాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ

విశాలాంధ్ర-సీతంపేట : సత్య సాయి 99 వ జన్మదినం సందర్భంగా సీతంపేట ఏరియా హాస్పిటల్‌లో రోగులకు సత్య సాయి భక్తులు పళ్ళు (బ్రెడ్స్) పంపిణీ చేశారు. సత్య సాయి సేవ సమితి వారు అనేక సోషల్ కార్యక్రమాలను నిర్వహిస్తూ, పేద ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నాను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరిడెంట్ శ్రీనివాసరావు, ఎంపీడీవో గీతాంజలి, జిసిసి మేనేజర్ నరసింహులు, ఎలక్ట్రికల్ ఏఈ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

శ్రామికులను సంఘటితం చేసి కార్మిక చట్టాలను పరిరక్షించుకుందాం

ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ

విశాలాంధ్ర-బెలగాం : కేంద్రంలోని ఎన్డీఏ మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న విధానాలపైన చర్చించేందుకు విశాఖపట్నంలో సెప్టెంబర్ 1,2,3, తేదీలలో ఎఐటియుసి జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్.వి.ఎస్ కుమార్ అధ్యక్షతన మన్యం జిల్లా ఏఐటియుసి జిల్లా సమితి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా నిర్మాణ భాధ్యులు పడాల రమణ, ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ లు ముఖ్య అతిథులుగా హారయ్యారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి బిజెపి మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకి దేశ సంపదలోని రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, బొగ్గు గనులను కారు చౌకగా అప్పజెప్తున్నారని విమర్శించారు. కార్మికులు ఎన్నో (అశేష) పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం లక్షలాది అసంఘటిత రంగ, వివిధ ప్రభుత్వ స్కీంలలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించకుండా వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి జగన్ ప్రభుత్వాన్ని గుర్తుకు వచ్చేలా ఆశ, అంగన్వాడి మధ్యాహ్నం భోజనం, ఇతర స్కీలలో పనిచేస్తున్న కార్మికుల్ని వేధించడం, అక్రమంగా తొలగించడం వంటి చర్యలు పాలుపడటం సిగ్గుచేటని అన్నారు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని పదేళ్ల పరిపాలన చేసిన బిజెపి ప్రభుత్వం దేశంలో నిరుద్యోగ సమస్యను పేదరికం పెంచి పోషిస్తున్నారని, బిజెపి విధానాల వలన ఈ దేశంలో ఉన్నటువంటి సంపదంత కూడా బడా కార్పొరేట్ చేతుల్లోకి పోవడం వల్ల దేశంలో ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వానికి దేశ అభివృద్ధి, రక్షణ ప్రజల ప్రయోజనాల కన్నా అంబానీ, ఆదాని వంటి కార్పొరేట్ యజమాన్యాల అభివృద్ధే మోడీకి ముఖ్యమన్నారు. ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో కాంట్రాక్టు వర్కర్ల జీవితాలని ప్రయివేటు కాంట్రాక్ట్ ఏజెన్సీలకి అప్పగించడం వలన ప్రతి నెలా జీతాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశస్వతంత్రం కోసం పోరాడిన చరిత్ర కలిగినటువంటి ఏకైక జాతీయ కార్మిక సంఘం ఏఐటియుసి అని స్వతంత్రానికి పూర్వమే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని కూడగట్టి కార్మిక హక్కుల కోసం అనేక సమ్మెలు పోరాటాలు చేసిన చరిత్ర కలిగినటువంటి ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతున్నా యన్నారు. ఈ ఎఐటియుసి జాతీయ సమితి సమావేశంలో దేశవ్యాప్త కార్మిక సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణని రూపొందించుకోవడం జరుగుతుందని సెప్టెంబర్ 3న విశాఖపట్నంలో జరుగు మహాకార్మిక ప్రదర్శన, బహిరంగ సభకు జిల్లాలోని ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈవి నాయుడు, ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సింహాద్రి దుర్గారావు, అలజంగి కుమారమ్మ, మజ్జి చంద్రమౌళి, ఆర్. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన బోధనా పద్ధతులను అమలుచేయాలి

విశాలాంధ్ర-బలిజిపేట : స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో అవగాహన చేసుకున్న నూతన బోధనా పద్ధతులను తరగతి గదిలో అమలు చేయాలని బలిజిపేట మండల విద్యాశాఖ అధికారి-1 సామల సింహాచలం అన్నారు. శనివారం ఆయన అరసాడ స్కూల్ కాంప్లెక్స్ ను సందర్శించారు. స్కూల్ కాంప్లెక్స్ జరుగుతున్నటు వంటి విధానాన్ని, ఉపాధ్యాయులు ఎంతవరకు అవగాహన చేసుకున్నారనే అంశాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు చక్కగా వినియోగించుకోవాలని, నూతన విద్యా విధానాలను అవగాహన చేసుకుని విద్యార్థులకు ఉపయోగకరమైన విధంగా బోధన చేసేందుకు పాఠశాలల్లో కృషి చేయాలని ఉపాధ్యాయులకు ఉద్బోధించారు. ప్రతి ఉపాధ్యాయుడు టీచర్స్ డైరీ, లెస్సన్ ప్లాన్స్ తయారు చేసుకోవాలన్నారు. తరగతి గదిలో టిఎల్ఎంను వినియోగించి బోధన చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ రమణ, రిసోర్స్ పర్సన్ శంబంగి వెంకటేష్, సిఆర్ఎంటి వైకుంఠ రావు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతానగరం : స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో అవగాహన చేసుకున్న నూతన బోధనా పద్ధతులను తరగతి గదిలో అమలు చేయాలని మండల విద్యాశాఖ అధికారి-1 జి.సూరిదేముడు, ఎంఈఓ-2 ముప్పల వెంకటరమణలు తెలిపారు. శనివారం సీతానగరం, మరిపవలసలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుచున్న స్కూల్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఓలేటి తవిటినాయుడు రిసోర్స్ పర్సన్ పి ఎస్ మోహన్, జి.రాజారావు, సిఆర్ఎంటి గణేష్, అనసూయ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతిచెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం

ఉపాధ్యాయుల మృతదేహాలను విమానం ద్వారా తరలింపు

విశాలాంధ్ర-సాలూరు : పాచిపెంట మండలంలో రాయిమాను వాగుదాటుతూ చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ సంఘటనలో పాచిపెంట మండలంలోని కొటికిపెంటలో ఏకలవ్య పాఠశాలలో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న హర్యానా రాష్ట్రానికి చెందిన మహేష్, ఉపాధ్యాయురాలు ఆర్తి మరణించారని తెలిపారు. వాగు దాటవద్దని స్థానికులు హెచ్చరించినప్పటికి బాషా సమస్యవలన అర్థం చేసుకోకపోవడంతో దురటన జరిగిందన్నారు. సంఘటన జరిగిన వెంటనే అధికారయంత్రాగాన్ని అప్రమత్తం చేసామని, స్థానిక తహశీల్దారు, పోలీసులు వెంటనే స్పందించి దురటన జరిగిన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారని, నిన్న సాయంత్రమే ఉపాధ్యాయురాలు మృతదేహం లభ్యంకాగా ఈరోజు ఉదయం వార్డెన్ మహేష్ మృతదేహం కనుకొని పోర్టుమార్టం నిమిత్తం తరలించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వారి ఆదేశాలమేరకు కుటుంబ సభ్యులతో మాట్లాడటం జరిగిందని, వారి కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల మృతదేహాలను గౌరవప్రదంగా తరలించుటకు ఏర్పాట్లుచేయవలసినదిగా ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం విమానం ద్వారా వారి రాష్ట్రానికి తరలించు టకు ఏర్పాట్లు చేసామని మంత్రి తెలిపారు. ఈమేరకు కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్ని చర్యలు చేపట్టారని ఆమె పేర్కొన్నారు.

విశాలాంధ్ర

అల్లూరి సీతారామరాజు

పార్వతీపురం మన్యం

పేజీ: 2

ఆదివారం 18, ఆగస్టు 2024

ఉపాధ్యాయుల మృతికి సంతాపం

విశాలాంధ్ర-సీతంపేట : మండలంలో పలు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాచిపెంట మండలం ఏకలవ్య స్కూల్లో విధులు నిర్వహించుకునీ ఇంటికి వెళ్లే సమయంలో గెడ్డ వాగు ఉధృతంగా పారుతున్న సమయంలో ఉపాధ్యాయులు కొట్టుకుపోయిన సంఘటనలో మృతి చెందిన ఉపాధ్యాయులకు శ్రద్ధాంజలి గటిస్తూ మౌనం పాటించారు.మృతులకు తక్షణమే ఎక్స్ గ్రేషియా ప్రకటించి మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యారాణికి ఎస్ టి యు మన్యం జిల్లా అధ్యక్షుడు పాలక పురుషోత్తం, రాష్ట్ర గిరిజన విభాగం కో కన్వీనర్ కె ప్రమోద్ కుమార్ సీతంపేట మండల అధ్యక్షుడు పాలక రాజారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది నిరసనలు, ఆందోళనలు, డిమాండ్

విశాలాంధ్ర-చింతపల్లి : మెడికో (వైద్యురాలు)పై సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ చింతపల్లిలో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసనకు దిగారు. దేశ ప్రజలంతా స్వాతంత్ర దినోత్సవ జరుపుకుంటున్న ఆగస్టు 15న పశ్చిమ బెంగాల్ కోల్‌కతాలోని ఆర్.జి.సి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ సెమినార్ హాల్లో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని, ఆసుపత్రులలో భద్రతా చర్యలు పటిష్టపరచాలని డిమాండ్ చేస్తూ వైద్యులు, వైద్య సిబ్బంది నిరసనలు చేపట్టారు. ఈ సంఘటనపై వైద్యులు, వైద్య సిబ్బంది దేశవ్యాప్త సమ్మెకు దిగారు. ఈ నేపథ్యంలో చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత, రక్షణ కోసం పలు నినాదాలతో కూడిన ప్లకార్డులు చేత బూని ఆసుపత్రి వద్ద నుండి పాత బస్టాండ్ మీదుగా హనుమాన్ కూడలి వరకు నినదిస్తూ భారీ ర్యాలీ చేశారు. అనంతరం గాంధీ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో మెడికోపై జరిగిన అతి దారుణమైన, కిరాతకమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రాణం పోసే వైద్యులకే ప్రాణ రక్షణ లేకుండా పోయిందని ఇటువంటి హేయమైన చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దిశా వంటి భయంకరమైన చట్టాలు, నిర్భయ వంటి కఠినతరమైన శిక్షలు ఉన్నప్పటికీ మానవ మృగాలలో మార్పు రావడం లేదన్నారు. శిక్షలను కఠినంగా అమలు చేయకపోవడం వలననే ఇటువంటి చర్యలు పునరావృతం అవుతున్నాయని, ఇటువంటి దుర్మార్గమైన అతి కిరాతకమైన చర్యలకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షిస్తేనే సమాజంలో మానవ మృగాళ్లు అత్యాచారాలు, హత్యలకు పాల్పడేందుకు భయపడే విధంగా శిక్షలు అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మహిళపై అత్యాచారాలు ఆపాలని శనివారం మండల కేంద్రంలోని వీరఘట్టం బిటివాడ వైద్యాధికారులు పి ఉమామహేశ్వరి, నితీశ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.పీహెచ్సీ దగ్గరి నుండి ప్రధాన రహదారి మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు అక్కడినుండి అంబేద్కర్ జంక్షన్ వద్దకు చేరుకొని మానవహారం చేపట్టి మీ భద్రత కోసం మేము మా భద్రత కోసం ఎవరు భద్రత లేనిదే డ్యూటీ చేయలేం మహిళపై హింస సమాజానికి శాపం మహిళపై అత్యాచార ఆపాలని స్త్రీల మానప్రాణాలు కాపాడాలని వుయ్ జస్టిస్ నినాదాలు చేసి అక్కడి నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన్ రావు, శాంతికుమారి, ఆదిలక్ష్మి, లలితకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ కలకత్తా లో ట్రైనీ మహిళా డాక్టర్ పై అత్యాచారం మరియు హత్యకు

నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మరియు అంగన్వాడి సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీగా బయలుదేరి ట్రైనింగ్ డాక్టర్ పై అత్యాచారం చేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని, ప్రాణాలను రక్షించే వైద్యుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ మారేడుమిల్లి ప్రధాన కూడలి వరకు నినాదాలు చేస్తూ ప్ల కార్డులు పట్టుకొని ర్యాలీని పోలీస్ స్టేషన్ కూడలి వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికృష్ణ మరియు సిడిపిఓ ప్రసన్న మాట్లాడుతూ నానాటికి మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు ఉద్యోగాలు చేయాలంటే భయపడాల్సి వస్తుందని అన్నారు. మహిళా డాక్టర్ పై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా శనివారం ఉదయం 6 గంటల నుండి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 24 గంటలు పాటు వైద్య సేవ చేస్తున్నామని, అత్యవసర సేవలు తప్ప మిగతా సేవలకు హాజరుకామని తెలిపారు అదేవిధంగా తరచూ ఇటువంటి దాడులు జరుగుతున్నాయని ప్రభుత్వాలు ఇటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరికృష్ణ, బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ సుబ్రహ్మణ్యం సిడిపిఓ ప్రసన్న మరియు మండల అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

సీతంపేట : మండల కేంద్రంలో ఏరియా ఆసుపత్రి సిబ్బంది కలకత్తాలో మహిళా డాక్టర్ పై అత్యాచారం జరిపి మృతికి కారకులపై

చర్యలు తీసుకోవాలంటూ ఆస్పత్రి సిబ్బంది సీతంపేట ఆసుపత్రి నుండి ఎన్టీఆర్ పార్క్ వరకు ధర్నా చేస్తూ బస్టాండ్ లో మానవ హారం చేపట్టారు. శనివారం 24 గంటలు విధులకు దూరంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాసరావు, వైద్యాధికారులు మనోజ్ రాజశేఖర్, రాజేష్, నిరోషా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో పాత్రికేయులు చేస్తున్న కృషి అభినందనీయం

ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవంలో కేక్‌కట్ చేస్తున్న డీఎఫ్ఓ సూర్యనారాయణ

విశాలాంధ్ర-చింతపల్లి : సమాజంలో జరుగుతున్న మంచి చెడులను వెలుగులోకి తెచ్చి మంచి మార్పుకు, సమస్యల పరిష్కారానికి కృషి చేసే వ్యవస్థ పాత్రికేయ వ్యవస్థ అని స్థానిక డివిజనల్ అటవీ శాఖ అధికారి (డిఎఫ్ఓ) సిహెచ్ సూర్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేశెట్టి సత్యనారాయణ (సతీష్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా ఏపీయూడబ్ల్యూజే పాత్రికేయులు ఏర్పాటుచేసిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చి సమాజంలో మంచి మార్పుకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వ్యవస్థ పాత్రికేయ వ్యవస్థ అన్నారు. అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకు, ప్రజలకు వారదులుగా పాత్రికేయులు చేస్తున్న కృషి, అందిస్తున్న సమాచారం అభినందనీయం అన్నారు. సమాజంలో యువత సన్మార్గంలో ఉండాలంటే మొట్టమొదట తల్లిదండ్రులు, తరు వాత ఉపాధ్యాయులు, మూడవ పాత్ర పాత్రికేయుల దన్నారు. ఎన్ని మంచి కార్యక్రమాలు చేసినా వెలుగులోకి రాకపోతే ఆ కార్యక్రమాలు ప్రజలకు తెలియవన్నారు. భావితరాల భవిష్యత్తుకు దిక్సూచి పాత్రికేయ వ్యవస్థ అని పాత్రికేయులు చేస్తున్న కృషి

అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. అనంతరం పాత్రికేయుల ఐక్యత వర్ధిల్లాలి, ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ వర్ధిల్లాలి అంటూ చేలు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారంతోపాటు, మంచి మార్పు కోసం పాత్రికేయులు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. వేతనాలు లేకున్నా, 24 గంటలు ఆన్ డ్యూటీలో ఉండే ఏకైక వ్యవస్థ పాత్రికేయ వ్యవస్థ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఏపీయూడబ్ల్యూజే యూనియన్ ఏర్పడి 66 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంలో నేడు 67వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు పాలకులకు వారదులుగా పనిచేస్తున్న తమను ఏ ప్రభుత్వం గుర్తించకపోవడం బాధ కలిగించే విషయం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత్రికేయులకు కనీస వేతన సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా పాత్రికేయులు కోరారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ప్రెస్ క్లబ్ పాత్రికేయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఏదైనా సాధించవచ్చు : ఆర్డీవో హేమలత

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం : క్రమశిక్షణతో చదివితే ఏదైనా సాధించవచ్చని పార్వతీపురం ఆర్డీవో కె. హేమలత అన్నారు. శనివారం స్థానిక వేదాంత కాలేజి ఐఐటి, జెఈఈ, నీట్ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ఫ్రెషర్స్-డే వేడుకలను "వేదాంతోత్సవ్" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలో ప్రముఖ వైద్య నిపుణులు సౌజన్య హాస్పటల్ అధినేత డా. పిబిపిఆర్ నాయుడు

ముఖ్య అతిథిగాను, పార్వతీపురం రెవెన్యు డివిజనల్ అధికారి కె. హేమలత, పట్టణ సబ్ ఇన్ స్పెక్టర్ బి.రవీంద్రరాజు గౌరవ అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డిఓ హేమలత మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలకు కట్టుబడి వుండాలని, క్రమశిక్షణతో చదివితే సాధించలేనిది ఏదీలేదని దానికి నేనే ఉదాహరణ అని చెప్పారు. సునయన, గుణచందన, రోహిత్ మొదలగు విద్యార్థులతో ముఖాముఖిగా వాళ్ళ సందేహాలను నివృత్తి చేశారు. సబ్ ఇనస్పెక్టర్ రవీంద్రరాజు మాట్లాడుతూ నేటి యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారకుండా చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం వేదాంత కళాశాలలో ఐఐటి-నీట్ అకాడమీలో చదివి ఐఐటీలో సీట్లు సాదించిన సందీప్, పూడి హరిప్రియలను అబినందిస్తూ వారి తల్లిదండ్రు లను దుశ్శాలువాలతో సత్కరించారు. నీట్‌లో ర్యాంకు సాదించి డెంటల్‌లో సీటు సాదించిన కుమారి శ్రీహరాను అభినందించారు. వీరితో పాటుగా ఎన్ఐటిలో సీట్లు సాదించిన తుమిడి సుజిత్ కుమార్, ప్రతాప్ రాజు, రెజేటి కల్యాణ్‌లను అభినందిస్తూ వారి తల్లిదండ్రులను సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ ఏదాది ఇంటర్మీడియట్ లో అత్యదిక మార్కులు సాదించి ఈఎపిసిఈటిలో 3,000 ర్యాంకు సాధించిన కుమారి కె. సుహార్షిణి, ఉల్లిభద్ర జిల్లా పరిషత్ హైస్కూల్ లో చదివి ఇంటర్ లో 969 మార్కులు సాధించి ఈఎపిసిఈటిలో 12,000 ర్యాంకుతో అనిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సాదించిన రౌతు అఖిలను వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ ఎపిసి, బైపిసి గ్రూపులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చిలకలపూడి జ్యోష్న, వారణాసి రమ్య, లచ్చుపతి నిహారిక, సుశీల హాసిని, సాయిలక్ష్మి, నిహారికాలను వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చీఫ్ మెంటర్ డాక్టర్ పెంట అప్పారావు, డైరక్టర్ ఎస్ఎల్ నాయుడు, డీన్ రమణబాబు, వైస్ ప్రిన్స్ పాల్ లు లోకేశ్, రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : జిల్లాలలో విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రణాళిక మరియు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047 పై జిల్లా అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, పరిస్థితులు, అభివృద్ధికి గల అవకాశాలను పేర్కొంటూ వంద రోజుల డాక్యుమెంట్ రూపకల్పన జరగాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రతి అంశానికి సంబంధించి విలువ ఆధారిత జోడించి కార్యాచరణ చేయాలని ఆయన అన్నారు. ప్రతి రంగంలో కనీసం 15 శాతం వృద్ధి సాధించుటకు అవకాశాలు పొందుపరచుతూ డాక్యుమెంట్ తెలియజేయాలన్నారు. రాబోయే 25 సంవత్సరాల ప్రణాళిక అని, ప్రజల వద్దకు తీసుకువెళ్ళి అందరి సహకారంతో తయారు చేయాలని ఆయన సూచించారు. అక్టోబర్ 2వ తేదీన విజన్ డాక్యుమెంట్ విడుదలకు అవకాశం



ఉందని తెలిపారు. పేదరిక రహిత రాష్ట్రంగా ఆవిర్భంచుటకు దోహదం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర్రాజు, గణాంక అధికారి కె.బి రామానుజాచార్యులు, ఉప గణాంక అధికారి వై.వి సత్యనారాయణ, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు. సాయికుమార్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎల్. అశోక్ కుమార్, ప్రణాళిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పట్టణంలోని శివారు ప్రాంత కాలనీలలో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. శనివారం మున్సిపాలిటీలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓవర్ బ్రిడ్జ్ క్రింద ఉన్న ప్రదేశంలో ఎంఆర్ఎఫ్ సెంటర్ ఏర్పాటు గాను స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు.రైల్వే మూడవ లైన్ నిర్మించడం వలన కొత్తవలస 9వ వార్డు విజయరామరాజు కాలనీ 2009లో కాలువలు నిర్మించడం జరిగిందని అప్పట్లో రైల్వేలైన్ వైపు నీరు మళ్ళించడం వలన ఇప్పుడు రైల్వే వారు మూడవ లైన్ నిర్మించడం వలన మురుగునీరు వెళ్లకుండా గోడను నిర్మించడం జరిగింది. కావున దానివలన కాలనీ చివర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండుటవలన మరలా కాల్వ నిర్మాణం చేపట్టుటకై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జయంతి,డిఇ కిరణ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మురళి, టౌన్ ప్లానింగ్ సెక్రెటరీ లు పాల్, నీరజ, శానిటేషన్ సెక్రెటరీలు అచ్యుత్, వెంకట్రావు, స్వరూప్, మేస్త్రిలు సాయి,రవి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు

విశాలాంధ్ర - బెలగాం : బాల్య వివాహాలు వద్దు...చదువే ముద్దు అని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ అన్నారు. శనివారం పార్వతీపురంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయి వయస్సు 18 సంవత్సరాలు, అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు లోపు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన లేదా పెళ్లి చేసిన లక్ష రూపాయలు జరీమానా, రెండు సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. బాల్య వివాహాల వలన కలిగే ఆరోగ్య, ఆర్థిక, సామాజిక అనారోగ్యాలను తెలిపారు.ఆరోగ్య పరంగా అనేక నష్టాలు కలుగుతాయని చెప్పారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగినట్లయితే ఆ గ్రామంలో మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీస్) కి లేదా పిల్లల సహాయ వాణి టోల్ ఫ్రీ నెంబర్ 1098 తెలియజేయాలని కోరారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్. ప్రసాదరావు మాట్లాడుతూ కౌమార దశలో తీసుకోవలసిన పౌష్టిక ఆహారం గురించి, చెడు స్పర్శ, మంచి స్పర్శ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఒ.ఆర్.డబ్ల్యూ. ఆర్. హరికృష్ణ, పాఠశాల ప్రాధానోపాధ్యాయులు ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడ్డపుశీల గ్రామాన్ని ఇమ్యునైజేషన్ అధికారి సందర్శన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మండలం అడ్డపుశీల గ్రామాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

ఎం.నారాయణ సందర్శించి పలు ఆరోగ్య కార్యక్రమాల పరిశీలన చేశారు. ముందుగా అక్కడ చిన్నారులకు నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేసి వైద్య సిబ్బంది టీకా వేస్తున్న తీరును గమనించారు. వ్యాక్సిన్ ను తనిఖీ చేశారు. టీకా కార్డుల్లో తేదీల నమోదును పరిశీలించి, నిర్ణీత గడువు తేదీలను తల్లిదండ్రులకు విధిగా తెలియజేయాలని అన్నారు. అక్కడ ఉన్న తల్లిదండ్రులతో ఆయన మాట్లాడి పిల్లల ఆరోగ్య స్థితిపై అడిగి తెలుసుకున్నారు. మొదట 6 నెలలు తల్లి పాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారం లబిస్తుందిని, తల్లి పాలు శిశువును న్యూమెనియా, అతిసారవ్యాధి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడుతుందని వారికి వివరి%శీ%చారు. టీకా వివరాలన్నీ ఆన్లైన్ లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జయగౌడ్, ఎఎన్ఎం శాంతికుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తొలిగించాలి :ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: విద్యా సంస్థల్లోనూ పాఠశాలల ఆవరణలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర విద్యుత్ అధికారులను కోరారు. శనివారం పార్వతీపురం మండలం బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భవనాలను తాకుతూ వెళుతున్న విద్యుత్ స్తంభాలను ప్రధానోపాధ్యాయులు

కోరిక మేరకు పరిశీలించారు. వెంటనే ఏపీ ఈపీడీసీఎల్ పార్వతీపురం ఈఈ కే గోపాల్‌నాయుడు, డిఈ సిహెచ్ వి రమణలను పాఠశాలకు పిలిపించి విద్యుత్ స్తంభాలను చూపించారు. సాధ్యమైనంత త్వరగా వీటిని తొలగించాలని ఎమ్మెల్యే విద్యుత్ అధికారులను కోరగా, వారు ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారి సూచన మేరకు సమస్యను పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు గోరజాన చంద్రమౌళి, బోను చంద్రమౌళి, గొట్టాపు వెంకటనాయుడు,శంకరరావు, కోట శ్రీధర్ బేత లక్ష్మణరావు, మాంధాత నాయుడు టిడిపి జనసేన,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

రెండోసారి వాయిదా పడిన మూడు పాఠశాలల ఎస్ఎంసి ఎన్నికలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంటిపేట, కొత్తవలస ప్రాథమిక పాఠశాలల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు కోరం లేక రెండోసారి వాయిదా పడ్డాయి. నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 తరగతిలకు గాను గతంలో ఏడుతరగతులకు చెందిన సభ్యుల ఎన్నికలు పూర్తికాగా, శనివారం ఏడవ తరగతిలో సభ్యుల ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా కోరం లేక వాయిదా వేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు పార్వతి తెలిపారు. తరగతిలో 46మంది విద్యార్థులుఉండగా 23 మందికి తల్లిదండ్రులు హాజరు కావలసి ఉండగా 22 మంది మాత్రమే రావడంతో చివరి నిమిషం వరకు చూసి కోరం లేక వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఈగ్రామంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎస్ ఎం సి ఎన్నికలకు క్యాంప్ రాజకీయాలను నిర్వహించడం గమనార్హం. చివరకు వైయస్సార్ పార్టీ తరఫున 22 మంది తల్లిదండ్రులు హాజరుకాగా తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీలకు చెందిన తల్లిదండ్రులు ఎన్నికలలో పాల్గొనలేదు. దీంతో వాయిదా వేయడం జరిగిందని హెచ్ఎం తెలిపారు. అంటి పేట కొత్తవలస గ్రామాల్లో కూడా ఒకటవ తరగతి, రెండవ తరగతి సభ్యులకు సంబంధించి కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు మండల విద్యాశాఖ అధికారులు సూరిదేముడు వెంకటరమణలు తెలిపారు. ఎన్నికలకు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎం రాజేష్ తెలిపారు. సీఐ గోవిందరావు కూడా మూడు పాఠశాలలను సందర్శించి సూచనలు చేశారు. పాఠశాలల వద్ద సీతానగరం పోలీసులతోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు కూడా ఉండి ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకున్నారు. మూడు పాఠశాలల్లో కూడా స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం స్పష్టంగా కనిపించింది. నువ్వా నేనా అన్న రీతిలో ఇరుపార్టీల నాయకులు ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-బెలగాం : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఎపియుడబ్ల్యూజె) 68వ వార్షికోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పార్వతీపురం (బెలగాం) రైతు బజార్ సమీపంలో గల పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులకు పార్వతీపురం ఎపియుడబ్ల్యూజె జిల్లా నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లువాడ కిశోర్, గంగి శ్రీనివాసరావు, కోశాధికారి సాలాపు అనంతరావు, ఉపాధ్యక్షులు జి. గోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు సుధాకరరావు, జిల్లా నాయకులు ఆర్వీఎస్ కుమార్, వానపల్లి శంకరరావు, బి. రాజశేఖర్, సత్యానంద్, ఎంపి భగవాన్ దాస్, ఆట్ల దివాని, ఎ. శేఖర్, రాము, నాని, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో కేంద్రంలో మొదటి సారిగా మండల కేంద్రం మక్కువ విచ్చేసిన మంత్రి సంధ్యారాణికి టిడిపి అభిమానులు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణు సమక్షంలో ఘనస్వాగతం పలికారు. టీడీపీ ఎమ్మెల్యేగా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ గిరిజన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారిగా మండల కేంద్రానికి సంధ్యారాణి రాకతో పసుపు సైనికులు, మిత్రపక్షాలు కలిసి మజ్జి గౌరమ్మ తల్లి గుడి నుండి 4 రోడ్లు కూడలి వరకు ర్యాలీగా తరలివచ్చారు. దారిపొడవునా పూలవర్షం కురిపిస్తూ, నృత్యాలు చేసిన టిడిపి అభిమానులు సంధ్యారాణి మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా ఎమ్మెల్యే లేకున్నా పార్టీని విడిచిపెట్టకుండా నా వెన్నంటే అండగా ఉన్న ప్రతీ ఒక్కరికీ నా ధన్యవాదాలు తెలిపారు. మక్కువ ప్రజలకు ఇకపై మీ కష్టసుఖాల్లో మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణు మల్లేశ్వరరావు చింతల నాయుడు చోడవరపు రామకృష్ణ దాసరి కేశవరావు టిడిపి కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు. దారిపొడవునా అభివాదం చేస్తూ ఇకపై మీ కష్ట సుఖాల్లో మీకు అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చిన మంత్రి సంధ్యారాణి.

సేవా పురస్కారాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది

సేవా పురస్కార గ్రహీతలు తహసిల్దార్ రామకృష్ణ, ఎంఈఓ బోడంనాయుడు

విశాలాంధ్ర-చింతపల్లి : సేవా పురస్కారాలకు ఎంపిక కావడం పట్ల సంతోషంగా ఉందని స్థానిక తహసిల్దార్ టి రామకృష్ణ, ఎంఈఓ బోడంనాయుడు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ మండలంలో తాము అందించిన సేవలకు గాను స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమకు వృత్తిపట్ల ఉన్న నిబద్ధతకు ఈ పురస్కారం రావడం జరిగిందని, తమ సేవలను గుర్తించిన ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించడం వల్లనే ఈ పురస్కారాలు లభించినట్లు తాము భావిస్తున్నామన్నారు. అంకితభావంతో ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తే అధికారులు, ప్రభుత్వం గుర్తిస్తుందని ఈ సందర్భంగా వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

యువ ఐఏఎస్‌లను ఐటీడీఏ పీఓలుగా నియమించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : యువ ఐఏఎస్‌లను సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏలకు పీఓలుగా నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్‌లు డిమాండ్ చేసారు. పదిహేను రోజుల్లో పీఓలను ఆకస్మికంగా బదిలీలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం పది రోజులు అవుతున్న రెగ్యులర్ పీఓలను నియమించక పోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే యువ ఐఏఎస్ లను ఐటీడీఏ పీఓలుగా నియమించాలని డిమాండ్ చేసారు.ఐటీడీఏ లకు రెగ్యులర్ పీఓలు లేకుండా గిరిజన సంక్షేమం ఎలా సాధ్యం అని ప్రశ్నించారు.ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు ఏర్పాటుచేసి గిరిజన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. వాగులో కొట్టుకుపోయి మృతిచెందిన కొటికిపెంట ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయురాలు ఆర్తి మృతికి సంతాపం తెలిపారు.అన్ని వసతులతో ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.

బొత్సకు అభినందనలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రాష్ట్ర మాజీ మంత్రి, ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సభ్యులుగా నిన్న ఏకగ్రీవంగా నియామకం కాబడిన బొత్స సత్యనారాయణని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియ చేశారు. శాసనమండలిలో అడుగు పెట్టబోతున్న శుభ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియచేశారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

మూడు పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతం

విశాలాంధ్ర-బలిజిపేట : మండలంలో శనివారం నాడు రెండోసారి జరిగిన ఎస్ఎంసి ఎన్నికల్లో మూడు పాఠశాలల్లో ప్రశాంతంగా పూర్తయ్యాయని, మిగిలిన మూడు చోట్ల వాయిదా పడ్డాయని బలిజిపేట మండల విద్యాశాఖ అధికారి 1సామల సింహాచలం తెలిపారు. మొత్తం ఆరు పాఠశాలలకు ఎస్ఎంసి ఎన్నికలు జరగాల్సి ఉండగా జడ్పీహెచ్ఎస్ చిలకలపల్లి, అజ్జాడ నారంనాయుడు వలస ఎంపీపీ పాఠశాలల్లో ఈరోజు పూర్తయ్యాయన్నారు. మిగిలిన మూడు చోట్ల జడ్పీహెచ్ఎస్ నారాయణ నాయుడు వలస, ఎంపీపీఎస్ గంగాడ, పి చాకరాపల్లి పాఠశాలల్లో నిబంధనల ప్రకారం తగిన కోరం లేనందున అక్కడ ఎన్నికలు వాయిదా పడినట్లు తెలిపారు. ఈ వివరాలను జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఎంఈఓ తెలిపారు.

పీహెచ్‌సి సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ దుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నల్ల బ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన ఆందోళన చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రత్నం, సూపర్వైజర్ రామారావు, హెచ్‌వి పద్మ, మంజుల, ఎంఎల్‌హెచ్‌పిలు, స్టాపనర్సులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినిని హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-జీకే వీధి : కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై జరిగిన దారుణాన్ని ఖండిస్తూ మండలంలో పలువురు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యాచార ఘటన తీరు చూస్తుంటే మానవత్వం ఎక్కడ ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ప్రతి మహిళకు భద్రత గౌరవం కాపాడేందుకు మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. మెడికల్ కాలేజ్‌లో మహిళ డాక్టర్‌ని అత్యాచారం చేసి దారుణ హత్యకి నిరసనగా రింతాడ జంక్షన్‌లో శనివారం సాయంత్రం 6.00 గం.లకు మన్యపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామంలో మహిళలు యువత గ్రామస్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు .

పాఠశాలలో నూతన విద్యా కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక

విశాలాంధ్ర-మారేడుమిల్లి :మండలంలో శనివారం పలు పాఠశాలల్లో నూతన విద్య సేవించదానికి సంబంధించి చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల చేత ఎన్నుకోవడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపల్ సత్యవేణి మరియు విద్యార్థుల తల్లిదండ్రుల చేత శనివారం నాడు నూతన విద్యా కమిటీ చైర్మన్ సూంట్రు కుమార్ రెడ్డి మరియు చైర్మన్‌గా చెదల విశ్వజ్యోతి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నీల్ ఆర్మీ సాంగ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలయ్య విద్యార్థుల తల్లిదండ్రుల చేత నూతన చైర్మన్ గా గడుతూరి రవికుమార్ వైస్ చైర్మన్ కత్తుల శ్రీదేవి ఎన్నిక అవడం జరిగింది. మండల ప్రజా పరిషత్ పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు శ్రీమతి వీణా దేవి మరియు విద్యార్థుల తల్లిదండ్రు నూతన విద్యా కమిటీ చైర్మన్ బొరగా తిత్వ దాస్, వైస్ చైర్మన్ బచ్చు అనిత ఎన్నుకోవడం జరిగింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల యందు ప్రధాన ఉపాధ్యాయులు బీఎస్ కుమార్ మరియు విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో నూతన విద్యా చైర్మన్ గా జారేపల్లి రాజేశ్వరి, వైస్ చైర్మన్‌గా పూజారి మంగమ్మ ను ఎన్నుకోవడం జరిగింది. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కుమారి మయూరి లక్ష్మి మరియు విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో నూతన విద్యా కమిటీ చైర్మన్ గా డి తేజస్విరి మరియు వైస్ చైర్మన్ గా కే నారాయణరెడ్డి ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా గిరిజన సంక్షేమ ఆశ్రమం బాలల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడకం రామారావు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు నూతన విద్యా కమిటీ చైర్మన్గా పి విజయశాంతి మరియు వైస్ చైర్మన్ గా సిహెచ్ చిన్నారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అదేవిధంగా మండలంలో పలు పాఠశాలలో శనివారం 2024-25 విద్యాసంవత్సరానికి గాను నూతన విద్యా కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ మెంబర్లను ఎన్నుకోవడం జరిగింది.

పాఠశాలల్లో ఎన్నికల నగారా

పేరెంట్స్ కమిటీ పేరును స్కూల్ మేనేజ్మెంట్ కమిటీగా మార్పు"

విశాలాంధ్ర-పాడేరు : ప్రభుత్వ పాఠశాలల్లో ఓ యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు శనివారం పాత పాడేరు ప్రభుత్వ పాఠశాల, గురుకుల పాఠశాల, గుత్తులు పొట్టు గిరిజన సంక్షేమ బాలికల ప్రభుత్వ పాఠశాలలో యజమాన్య కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలు నిర్వహించారు. పాత పాడేరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల చైర్మన్‌గా కొర్ర కృష్ణారావు, వైస్ చైర్మన్‌గా జి శాంతి ఎన్నుకోబడ్డారు. గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గణేష్ ఏఎస్ఎస్‌టి ప్రిన్సిపల్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలలో చైర్మన్ కె రంభ.వైస్ చైర్మన్ పి.చిట్టిబాబు ఎన్నుకోబడ్డారు. గుత్తులు పుట్టు ప్రభుత్వ బాలికల పాఠశాలలో కొంతేలి వెంకటప్రసాద్ చైర్మన్గా ఎన్నుకోగా వైస్ చైర్మన్ గా శాంతి కుమారి ఎనుకబడ్డారు. ఈ ఎన్నికల్లో పిల్లల తల్లిదండ్రులు ఆయా పాఠశాల పరిధిలో పాల్గొనున్నారు. ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీల్లో విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యుల భాగస్వామ్యంతో వీటినిఏర్పాటు చేశారు. ఈ కమిటీ పాఠశాలలో తరగతుల నిర్వహణ, నిధుల వినియోగం. ప్రభుత్వ పథకాలు అమలు తీరు తదితర వాటిని పర్యవేక్షిస్తారు. ఎన్నికల అధికారిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వ్యవహరిస్తారు. ఎన్నికైన సభ్యుల కాలపరిమితి రెండేళ్లు, "పేరెంట్స్ కమిటీ పేరును స్కూల్ మేనేజ్మెంట్ కమిటీగా మాకు చేయడం జరిగింది.

పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా సుందర్‌సింగు

విశాలాంధ్ర-రంపచోడవరం : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్డీఏ కూటమి తరుపున జనసేన అభ్యర్థి విద్యా కమిటీ చైర్మన్ గా ఎన్డీఏ తరఫున జనసేన అభ్యర్థి ధుమంతి సుందర సింగు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గవర్నమెంట్ హై స్కూల్ హెచ్ఎం నాగిరెడ్డి పద్మావతి సిబ్బంది సహకారంతో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగాయి. కమిటీ వైస్ చైర్మన్ గా పి. స్రవంతి ఎన్నికయ్యారు. వీరితో పాటు 18 మంది సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల్లో మూడవ తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కుర్లా రాజశేఖర్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కాకి స్వామి, రంపచోడవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు పిఆర్పి శీను, టిడిపి సీనియర్ నాయకుడు అడబాల బాపిరాజు, సురేష్ జనసేన సీనియర్ కార్యకర్త సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యా కమిటీ ఎన్నికలు

డివిజన్‌లోని మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

విశాలాంధ్ర-ఎటపాక : విద్యాకమిటి ఎన్నికలు మండల వ్యాప్తంగా శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఇందులో భాగంగా గౌరీదేవి పేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్ ఎం సీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయింది. గతంలో ఛైర్మన్ గా గుండె సుధాకర్, వైస్ ఛైర్మన్‌లుగా చేసిన పిట్టల వారే పోశమ్మ లు మారో సారి ఎంపిక కావడంతో ఇద్దరినీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి దొంతు మంగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ గౌరీదేవిపేట పాఠశాల ను మోడల్ స్కూల్‌గా తీర్చి దిద్దుతామన్నారు. స్థానిక ఎమ్మెల్యే శిరీష దేవి ద్వారా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యలు తీసుకేళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పాఠశాలకు మంచి చేసేవారిని చైర్మన్ ను వైస్ చైర్మన్‌గా ఎంచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో విద్యావ్యవస్థ పరిస్థితి దయనీయంగా మారిందని పూర్తిగా మార్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ , సర్పంచ్ ఉలవల శివకుమార్ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో 2వ ఎంటీసీ రాజులు పాల్గొన్నారు.

కోల్‌కతా డాక్టరు హత్యకు కారకులైనవారిని తక్షణమే శిక్షించాలి

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

విశాలాంధ్ర-సీతానగరం : పశ్చిమబెంగాల్లో ట్రైనీ పోస్ట్ గ్రాడ్యుయేట్ మహిళా డాక్టర్‌పై జరిగిన అత్యాచార హత్యకు నిరసనగా దేశంమొత్తం మీద వైద్య సేవలను చేయడానికి నిరాకరిస్తూ శాంతియుతంగా న్యాయం జరగడానికి నిరసన ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సీతానగరం పెద్ద అంకలాం వైద్యులు ఉషారాణి, రాధా కాంత్, పావని, సిహెచ్‌ఓలు సూర్యనారాయణలు తెలిపారు. శనివారం ఉదయం ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు రెండోపూట సీతానగరం మార్కెట్, ప్రధాన వీధులలో సీతానగరం,పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు,పారామెడికల్ సిబ్బంది, ఆశాకార్యకర్తలు, సచివాలయ వైద్య ఆరోగ్య సిబ్బంది, ఎం ఎల్ హెచ్ పి లు అందరూ కలిసి నల్ల బాడ్జీలతో నిరసన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు . రాష్ట్రీయ రహదారిపై బస్టాండ్ కూడలి వద్ద మానవహారం కాబట్టి వైద్యులకు మద్దతుగా నినాదాలు డాక్టర్ మృతిక కారకులైన వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యాచారానికి హత్యకు గురైన డాక్టర్ కిన్యాయం జరిగేంతవరకు ఈశాంతియుత పోరాటం నల్లబాడ్జీలతో నిర్వహిస్తామని సీతానగరం వైద్యాధికారి, పెదంకలాం వైద్యాధికారిలు తెలిపారు. ఈహత్యకు అత్యాచారానికి నిరసనగా శనివారం ఉదయం నుండి ఆదివారం ఉదయం వరకు హాస్పిటల్ లో వైద్య సేవలను కూడా నిలుపుదల చేస్తూ అత్యవసర వైద్య సేవలను మాత్రమే అందజేసి మిగిలిన సేవలను బందు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్లు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ యస్ దినేష్ కుమార్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ లు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జెకె మహేశ్వరి ని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

వంద రోజుల విజన్ డాక్యుమెంట్ తయారుచేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో వంద రోజుల విజన్ డాక్యుమెంట్ ను అన్ని శాఖలు తక్షణం తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047 పై దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రాథమిక రంగాల శాఖలతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్టడుగు స్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చేలా శాఖల విజన్ ఉండాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని అవసరమగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సామాన్యుడికి ఫలాలు అందాలని, జిల్లా స్థాయి నుంచి కుటుంబ స్థాయి వరకు ఒక యునిట్ గా ప్రణాళికలు రచించాలని సూచించారు. అప్పుడే విజన్ డాక్యుమెంట్‌కు సార్థకత చేకూరుతుందని అన్నారు. విజన్ 100 రోజుల డాక్యుమెంట్ రూపకల్పనకు అన్ని శాఖల అధికారులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అంశానికి సంబంధించి విలువ ఆధారిత జోడించి కార్యాచరణ చేయాలని అన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, పరిస్థితులు, అభివృద్ధికి గల అవకాశాలను పేర్కొంటూ వంద రోజుల డాక్యుమెంట్ రూపకల్పన జరగాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆరోగ్యం, సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, స్థిరమైన అభివృద్ధి వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ డాక్యుమెంట్ ఎంతో అవసరమని తెలిపారు. 2024 సంవత్సరం నుండి 2029 వ సంవత్సరం వరకు శాఖల వారి అభివృద్ధికి ప్రణాళికలు ఆవస్యమన్నారు. ప్రతి ఏడాది కనీసం 15 శాతం వృద్ధి రేటు సాధించే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ప్రణాళికల రూపకల్పనలో ఆర్థిక, భౌతిక లక్ష్యాలు స్పష్టంగా పేర్కొనాలని ఆదేశించారు. ఏ పథకం క్రింద ఏ మేరకు అమలు చేయగలమో పరిశీలించి, వాస్తవాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక తయారు కావాలని సూచించారు. గ్రామ స్థాయి ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. ప్రాథమిక రంగాలు, తయారీ రంగాలు, సేవా రంగాలు వారీగా స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. జిల్లా తలసరి ఆదాయం, స్థూల ఆదాయం గణనీయంగా వృద్ధి సాధించుటకు డాక్యుమెంట్ ఉపయోగపడాలని అన్నారు. ఉత్తమ విజన్ డాక్యుమెంట్ తయారు కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26వ తేదీ నాటికి ముసాయిదా నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర రాజు మాట్లాడుతూ విలువ ఆధారిత ఉండే విధంగా ప్రతి అంశానికి రూపకల్పన జరగాలన్నారు. సామర్థ్యాలు గుర్తించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం సూచించిన సమయానుగుణంగా ప్రణాళికలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖ అధికారి జి పగడాలమ్మ, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు,జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు సాయి కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం రుక్మాంగదయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ శివ ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డా టీ జగన్మోహన రావు, డా ఎం వినోద్, డా పి ఎల్ రఘు కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, ఎపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ బి హరిబాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి ఎం.జేమ్స్, జంఝావతి కార్యనిర్వహక ఇంజనీర్ జగదీష్, ఇన్‌ఛార్జ్ జిల్లా ఉద్యానశాఖ అధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటరీకరణ పూర్తి చేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులు వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం కలెక్టరు చాంబరులో సహకారశాఖ అధికారులు, డిసిసిబి బ్యాంకు మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ సహకార సంఘాల సభ్యుల వివరాలు కంప్యూటరీకరణ పనులను సమీక్షించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులు సహకార రంగంలో విప్లవాత్మకమార్పులు తీసుకువస్తాయని తెలిపారు. వందశాతం కంప్యూటరీకరణ పనులు మూడురోజులలో పూర్తికావాలన్నారు. డేటా సేకరణలో తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారుల సహకారం తీసుకోవాలని, సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కంప్యూటరీకరణ చేయడం వలన సహకార బ్యాంకుల సేవలు సభ్యులకు పూర్తి స్థాయిలో అందుబాటులోనికి వస్తాయని, సహకార బ్యాంకుల అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. బ్యాంకులలో రుణం తీసుకున్నవారి వివరాలే కాకుండా సహకార సంఘాలలో సభ్యతం కలిగిన సభ్యులందరి వివరాలను కంప్యూటరీకరించాలన్నారు. కంప్యూటరీకరణ ప్రక్రియ పర్యవేక్షణ భాద్యతలను మండల ప్రత్యేక అధికారులకు అప్పగించాలని జిల్లా నోడల్ అధికారి మరియు సంయుక్త కలెక్టరు ఎస్ఎస్ శోభికను ఆదేశించారు. ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ కు అనుగుణంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను స్వావలంబన చేయడానికి భారత ప్రభుత్వం కంప్యూటరీకరణ ప్రక్రియను చేపట్టిందని, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుకు సదరు డేటాను జాతీయ స్థాయిలో అనుసంధానం జరుగుతుందని తద్వారా పిఎసిఎస్ కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచడం, రుణాలను వేగంగా పంపిణీచేయడం, లావాదేవీల ఖర్చులను తగ్గించడం, చెల్లింపులలో అసమతుల్యతను తగ్గించడం జరుగుతుందన్నారు. సంఘాల కార్యకలాపాలలో పారదర్శకత పెరుగుతుందని, రైతులలో పిఎసిఎస్ పనితీరులో విశ్వసనీయత పెరుగుతుందన్నారు. కామన్ అకౌంటింగ్ సిస్టమ్ (సిఏఎస్) మరియు మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) అమలు ద్వారా పిఎసిఎస్ లలో ఆన్లైన్ సేవలు అందుబాటులోనికి వస్తాయని, రుణాలు పొందడానికి మరియు రుణాలు రీషెడ్యూలు పనులలో రైతులు వేగవంతమైన సేవలు పొందగలుగుతారని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కోపరేటివ్ అధికారి పి. శ్రీరామ్మూర్తి, డిసిసిబి బ్యాంకు మేనేజర్లు హాజరయ్యారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సర్వసభ్య సమావేశంలో మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో కేంద్రంలో సర్వసభ్య సమావేశంలో జడ్పిటిసి ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. గతంలో ఉన్న పరిస్థితుల నుంచి బయటకు రావాలి. రోడ్లు లేని గిరిజన గ్రామాల నుంచి ఉన్న గర్భిణీ స్త్రీలు ఏడో నెలలోనే మైదాన ప్రాంతాలో ఆస్పత్రిలో జాయిన్ చేయించాలన్నారు. వైద్య సేవలు అందాలి వసతి గృహాలలో విద్యార్థులు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి అని అన్నారు. అద్వానంగా ఉన్న రోడ్ల దుస్థితి పై మాట్లాడగా తాత్కాలికంగా వైట్ మిక్స్ వేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్అండ్‌బి వారికి చెప్పారు. మండల సమావేశంలో తహసిల్దార్ మాట్లాడిన తర్వాత సంధ్యారాణి మండల సమావేశం ఉంటుంది అనుకున్నాను కానీ అంత సక్రమంగా జరిగిందన్నారు. అదేవిధంగా మహిళ ప్రజాప్రతినిధులు సమస్యలపై మాట్లాడాలి అని సూచించారు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు గ్రామ స్వరాజ్యంతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యం అని ముఖ్యమంత్రి కలలు సాకారం కావాలంటే ముఖ్యంగా మండల అధికారుల సహాయ సహకారాలు ఎంతో అవసరం అని, మండల అధికారులందరూ కలిసి కట్టుగా వుండి మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధికి రాజకీయ నాయకులు కూడా అధికారులకు తోడ్పాటు అందించి కలిసికట్టుగా గ్రామీణ అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ సమావేశాలకు విధిగా సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన విషయాలు గురించి చర్చించాలని, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అనంతరం శాఖల వారిగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమైన విద్యుత్,రెవెన్యూ, హౌసింగ్, శానిటేషన్, రక్షిత మంచినీరు, ప్రజారోగ్యంతోపాటు అత్యవసర సేవలు పట్ల యుద్ధప్రాతిపదికన స్పందించాలని మంత్రి ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు మరియు మండల అధికారులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ అభియాన్ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : జిల్లాలో సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో జరిగిన కార్యక్రమంలో సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామ సభలోను సంపూర్ణ పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేపట్టాలని అందులో ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అవగాహన కలిగించాలని అన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు పౌష్టికాహార నిర్వహణపై వారం రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని మహిళా, శిశు సంక్షేమ శాఖను ఆదేశించారు. ఇందులో గర్భిణీ స్త్రీల సమోదు, పౌష్టికాహారం తీసుకోవడం, పౌష్టికాహారం కలిగిన ఆహార పదార్థాలను గూర్చి తెలియజేయడం, రక్తహీనత వంటి సమస్యలపై సూచనలు చేయాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 8వ తేదీన జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహిస్తూ విద్యాసంస్థల్లో వ్యాసరచన, డ్రాయింగ్ వంటి పోటీలను నిర్వహించాలన్నారు. చిన్నారుల్లో చిన్నప్పటి నుండే పౌష్టికాహారం విలువలు తెలియజేయడం, రక్తదానంపై అవగాహన కల్పించడం, బాల్యవివాహాల నివారణకు తోడ్పడటం వంటి చర్యలను తెలియజేయలన్నారు. సెప్టెంబర్ 17వ తేదీన వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బిపి, షుగర్, గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 25వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశ కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య విషయాల పట్ల అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ భూసార పరీక్షల నిర్వహణ, రైతులకు తగు సూచనలు చేయాలని, మార్కెటింగ్ సదుపాయాలు గూర్చి సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రజల్లో గ్రంథాలయాలకు పుస్తకాల వితరణ వంటి కార్యక్రమాలు చేయాలని, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల్లో లేని లబ్దిదారుల వివరాలు సేకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి. కేశవనాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్రరావు, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై. సత్యంనాయుడు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖ అధికారి జి. పగడాలమ్మ, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్. మన్మథరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు. సాయికుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం. రుక్మాంగదయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్. కృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ శివప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డా. టి. జగన్మోహన రావు, డా. ఎం. వినోద్ కుమార్, డా. పిఎల్ రఘు కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి కరుణాకర్, ఎపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ బి. హరిబాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి ఎం. జేమ్స్, జంఝావతి కార్యనిర్వహక ఇంజినీర్ జగదీష్, ఇంఛార్జ్ జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలను ఆర్డీవో పరిశీలన

విశాలాంధ్ర-పాచిపెంట : పాచిపెంట మండలంలో వాగులో కొట్టుకుపోయి ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందిన ఘటన తెలిసిందే.. ఈ ఘటనపై పార్వతీపురం మన్యం జిల్లా ఆర్డీవో కే హేమలత శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటన జరిగిన తీరును, చేపట్టిన చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాలూరు సామాజిక ఆసుపత్రిలో ఉన్న మృతదేహాలను ఆమె పరిశీలించారు. పోస్టుమార్టం వేగవంతం చేసి మృతదేహాలను అప్పగించాలని వైద్య సిబ్బందినీ ఆదేశించారు.

సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నిక

విశాలాంధ్ర - సీలేరు : జీకేవీధి మండలం సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల జరిగింది. ఈ ఎన్నికల్లో జంత్రంగి చిట్టిబాబు చైర్మన్‌గా, పూజారి నారాయణ వైస్.చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికకు పాఠశాల హెచెం అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా చైర్మన్ జంత్రంగి చిట్టిబాబు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు శనివారం కోళహలంగా జరిగింది. ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికొన్నత, గిరిజన ఆశ్రమ, కేజీబీవీల్లో విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకుని కమిటీని ఎన్నుకున్నారు. దీంతో పాఠశాలల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో అరకు పంచాయతీ నేరేడువలసలో గల జిపిఎస్ టి డబ్ల్యూ పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడు రామలింగం ఆధ్వర్యంలో పాఠశాల కమిటీ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్‌గా మహదేవ్, వైస్ చైర్మన్గా భానుమతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలుగా ఏర్పడిన యాజమాన్యం పాఠశాలల అభివృద్ధి, పిల్లల విద్య ప్రగతికి తోడ్పాటునివ్వాలని మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు సూచించారు. అనంతరం ఎన్నికైన చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ద్వారా ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జెడ్పిహెచ్ఎస్ ఎస్ఎంసి చైర్మన్‌గా మరిచర్ల శ్రీను

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: జిలా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఎస్ఎంసి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు 3వ తరగతి నుండి 10 వరకు చెందిన పిల్లల తల్లిదండ్రులు, తరగతికి ముగ్గురు సభ్యుల చొప్పున ఎన్నుకోవడం జరిగింది, నెగ్గిన 24 మంది సభ్యులలో మరిచర్ల శ్రీనును చైర్మన్ గాను, మిరియాల వెంకటరమను వైస్‌చైర్మన్‌గా ఎన్నుకొన్నారు.

నూతన తహసీల్దారుగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-గంగవరం : మండల తాసిల్దార్ గా సిహెచ్ శ్రీనివాసరావునియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

మంచి నీటి కష్టాలు తీర్చండి

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త విధి మండలం సంకాడ పంచాయతీ పరిధి జరుమూరు గ్రామ పెట్ల మాడి వీధిలో మంచినీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. గతంలో వీధి కులాయిలు నిర్మించినప్పటికి రోడ్డు విస్తీర్ణం పెరగడంతో నేషనల్ హైవే లైన్ పని నిమిత్తం పైపులైన్లు ధ్వంసం అయ్యాయన్నారు. ఒకే పైపులో నీళ్ల అందుబాటులో ఉండడం వల్ల నీటి కోసం మహిళలు చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే స్పందించి ప్రభుత్వం అధికారులు , ప్రజా ప్రతినిధులు నీటి కష్టాలు తీర్చాలని తీర్చే విధంగా తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

గన్నవరం ఎస్ఎంసి చైర్మన్‌గా మోహన్‌రావు

విశాలాంధ్ర-ఎటపాక : గన్నవరం ఎస్ఎంసి చైర్మన్‌గా మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎటపాక మండలం గన్నవరం కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు గోంది రాధ ఆధ్వర్యంలో ఎస్ఎంసి చైర్మన్ ఎన్నిక జరిగింది. రెండవసారి ఏక గ్రీవంగా ఎస్ఎంసి చైర్మన్‌గా పిడియాల మోహన్ రావు ఎన్నికయ్యారు. వైస్ ఛైర్మన్‌గా ఎస్కే ఖాతునా బేగం ఎన్నికయ్యారు. గెలుపొందిన చైర్మన్, వైస్ ఛైర్మన్‌లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు చంటి, హసీనా, ప్రమీల, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎస్ఎంసి చైర్మన్‌గా ఎన్నికైన దానే రాజ

విశాలాంధ్ర-ఎటపాక : కృష్ణవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వి.హేమలత ఆధ్వర్యంలో ఎస్ఎంసి చైర్మన్ ఎన్నిక జరిగింది. ఎస్ఎంసి చైర్మన్‌గా పోటీ చేసిన దానే రాజుకు 25 ఓట్లకు 24 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు చైర్మన్‌గా దానే రాజును నియమించారు. వైస్‌చైర్మన్‌గా చిచ్చడి మమత ఎన్నికయ్యారు. గ్రామస్తులు చిచ్చడి మల్లికార్జున్‌రావు దానే ఆటో రాజు సున్నం హరీష్ దానే రాము టిడిపి నాయకులు బొల్లా పుల్లయ్య అభినందించారు.